క్లుప్తంగా

విద్యార్థినికి ఆర్థిక సాయం



దాతలను కలిసిన విద్యార్థిని యశస్విని

కరప: తల్లిదండ్రులు కోల్పోయి కరపలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి చదువుకుంటూ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని కె.యశస్వినికి ఆరేళ్లపాటు నెలవారీ ఖర్చులకు ఆర్థిక సాయమందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. తల్లిదండ్రులు లేకపోయినా యశ్వసిని కరప హైస్కూల్‌లో పదో తరగతి చదివి, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కాకినాడలోని అరిగెల వెంకటేశ్వరరావుకు తెలుపగా ఆయన స్పందించి రిప్స్ రెస్టారెంట్ అధినేత ఆర్టీఎస్ రామ్‌వీర్, డాక్టర్ నైనా దంపతులకు యశస్విని పరిస్థితిని వివరించారు. శనివారం విద్యార్థిని యశ్వస్విని కాకినాడ తీసుకెళ్లగా దాతలు రామ్‌వీర్, డాక్టర్ నైనా దంపతులు స్పందించి తమ కుమారుని మొదటి పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల నుంచి నెలకు రూ.3 వేలు వంతున ట్రిపుల్ ఐటీ పూర్తయ్యే వరకు ఆరేళ్ల పాటు విద్యార్థిని బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసి, ఆర్థిక సాయమందిస్తామని తెలియజేశారు. ఆర్థిక సాయమందించేందుకు ముందుకు వచ్చిన దాతలకు మాజీ సర్పంచ్ తాతీలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ సలహా సభ్యుడిగా శ్రీరామచంద్రమూర్తి



బాలాజీచెరువు: జ్యోతిర్మనో నిపుణులు సీనియర్ జర్నలిస్ట్ ప్రముఖ పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తిని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఇండియా సలహా సభ్యుడిగా స్పిరుచ్యుయల్ కౌన్సిలర్‌గా ఎంపిక చేసినట్టు ఆ సంస్థ శనివారం ప్రకటించింది. ఆనందం కోసం ఆధ్యాత్మిక అమృతవాహిని కార్యక్రమాలు ఏర్పాటు చేసినందుకు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ ద్వారా సరిపెల్ల ఈ గౌరవం దక్కిందని అసోసియేషన్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ వింజరపు జనార్దనం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ బుజ్జి తెలియచేశారు. ఈ సందర్భంగా సరిపెల్ల మాట్లాడుతూ తనకు లభించిన ఈ బాధ్యతతో వివిధ వర్గాల వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఉత్సాహంగా అమ్మవారి నిమజ్జనం



రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో అమ్మవారి విగ్రహం ఊరేగింపు

కాకినాడ రూరల్: దసరా ఉత్సవాలు ముగియడంతో మండపాలు, ఆలయాలలో కొలువైన కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనాలకు తరలించారు. వాకలపూడి సంతోషనగర్‌లోని కనక దుర్గ ఆలయంలో ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహంతో పాటు రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లోని రెల్లిపేట వద్ద అమ్మవారి విగ్రహం, పలు గ్రామాల్లోని విగ్రహాలను శనివారం భారీగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సూర్యారావుపేట బీచ్ వద్ద నిమజ్జనం చేశారు.

ఎలక్ట్రిక్ కారులో మంటలు



ఎలక్ట్రిక్ కారు నుంచి వచ్చిన దట్టమైన పొగ

కాకినాడ రూరల్: స్థానిక 49వ డివిజన్ పరిధిలోని గైగోలుపాడు పైడా వారి వీధిలో ఒక ఇంట్లో పార్కింగ్ చేసిన కారు నుంచి వచ్చిన మంటలు వచ్చాయి. సకాలంలో మంటలు అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్.శ్రీహరిరాజు సుమారు రూ.46 లక్షలతో గత ఏడాది ఎలక్ట్రిక్ కారు కొనుగోలు చేశారు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద పార్కింగ్ చేసిన ఆ కారు నుంచి అనుకోకుండా మంటలు, దట్టమైన పొగ వచ్చింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. సుమారు రూ.15 లక్షలు నష్టం వాటిల్లి ఉంటుందని బాధితుడు తెలియజేసినట్టు అగ్నిమాపక అధికారి సుబ్బారావు తెలిపారు.

శ్రమ జీవులకు గౌరవం

కాకినాడ రూరల్: శ్రమ జీవులకు తగిన గౌరవం ప్రభుత్వంలో లభిస్తుందని, ఆటో డ్రైవర్లకు రూ.15వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోందని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. శనివారం గుడారిగుంట నుంచి శుభం కాపు కల్యాణ మండపం వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన చెక్కును ఆవిష్కరించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా కల్వర్టులు
- కూలిపోయిన రక్షణ గోడలు
- కొట్టుకుపోయిన రోడ్డు అంచులు
- ప్రమాదాల బారిన పయాణికులు



కరప సమీపంలో రావువారి కాలువపై రక్షణ గోడ లేని కల్వర్టు

కరప: రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ శాఖల అధికారుల నిర్లక్ష్యం వాహనచోదకుల పాలిట శాపంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు మలుపులో కాలువలపై ఉండే కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్లు ఆధునీకరించామని చెబుతున్న పాలకులకు శిథిలమైన కల్వర్టులు కానీ జరుగుతున్న ప్రమాదాలు కానీ కనిపించడం లేదా అని వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు రద్దీగా ఉండడంతో..

జాతీయ రహదారిని అనుసంధానం చేసే కాకినాడ-రావులపాలెం రోడ్డు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. కోటిపల్లి పుణ్యక్షేత్రం వెళ్లేందుకు గోదావరిని దాటేందుకు మండల వాసులు పెనుగుదురు-కోటిపల్లి రోడ్డు వెళ్లాల్సి ఉంది. ఈరోడ్డు ఎప్పుడూ బిజీగా ఉంటోంది. కోటిపల్లి, ద్రాక్షారామ, కాజులూరు మండలాల నుంచి, రామచంద్రపురం వైపు నుంచి అయిదారు మండలాల వారు పోర్టులోని పని చేసేందుకు జట్టు పనివారు, వైద్యం కోసం కాకినాడలోని ప్రభుత్వాసుపత్రికి, జిల్లా పరిషత్, కోర్టులు, కలెక్టరేట్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యనభ్యసించేందుకు విద్యార్థులు వేలాదిగా దిచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారుల్లో ఉండే కల్వర్టులకు రక్షణ గోడలు శిథిలమయ్యాయి. దీంతో రోడ్డు అంచు కోసుకు పోయి ప్రమాదభరితంగా తయారయ్యాయి. కాకినాడ-రావులపాలెం ప్రధాన రహదారిలో కరప సమీపంలోని రావువారి పంటకాలువ, న్యూభీమన్యకర్ర కాలువపై ఉండే కల్వర్టులకు ఒక వైపు రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. అలాగే కోటిపల్లి రోడ్డులో పెనుగుదురు సమీపంలో పంట కాలువపై ఉండే కల్వర్టు పూర్తిగా శిథిమైంది. ఆయా పంట కాలువలపై కల్వర్టుల రక్షణ గోడలు కూలిపోవడంతో రోడ్డు అంచులు పాడైపోయి ప్రమాదకంగా ఉన్నాయి. కల్వర్టులకు ఉండే రక్షణ గోడలు కూలిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో వాహనాచోదకులు అదుపు తప్పి కాలువలో పడిపోయి ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి సమయంలో అయితే ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పెనుగుదురు సమీపంలో ఉన్న పంట కాలువపై కూలిపోయిన రక్షణ గోడ

హెచ్చరిక బోర్డులు లేక..

కాలువలపై ఉండే కల్వర్టులకు రక్షణ గోడలు పునర్నిర్మించలేదు సరికదా కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టని అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రోడ్డు అంచులు కొట్టుకుపోవడంతో..



కాకినాడ నుంచి రావులపాలెం, కోటిపల్లి వెళ్లే రహదారుల్లో పంట కాలువలపై ఉండే కల్వర్టుల రక్షణ గోడలు కూలిపోయాయి. ఈ కల్వర్టుల వద్ద రోడ్డు కొట్టుకుపోయి ప్రమాదభరితంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పెంకే సత్తిబాబు, మాజీఎంపీటీసీ, కరప.

తప్పించుకునే తోవ లేక..



కల్వర్టులకు ఉండే రక్షణగోడలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిసమయంలో ఎదురుగా వచ్చే లారీలు, బస్సులను తప్పించుకునేందుకు పక్కకు వెళుతుంటే అదుపుతప్పి వాహనచోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. రక్షణగోడలు నిర్మించేలోపు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాదా వెంకటేశ్వరరావు, విజయరాయుడుపాలెం.

బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్న ఏసీబీ కోర్టు జడ్జి



అమ్మవారి చిత్రపటాన్ని జడ్జి వెంకటేశ్వరరావుకు అందిస్తున్న ఈఓ వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారిని శనివారం రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు దర్శించుకొని పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు అందించారు.

దరఖాస్తుల స్వీకరణ

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలో అర్హులైన విద్యా వలంటీర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈఓ-2 పి.పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కొత్తూరు, పెదపులి చెరువు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఎస్టీ కుటుంబాలకు చెందిన 21 మందికి విద్యా బోధన చేయడానికి సమగ్ర శిక్షణ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో గుడాలు వేసుకొని నివాసం ఉంటున్న వారి కుటుంబాల పిల్లల్లో సామర్థ్యం పెంచడానికి వలంటీర్లు కృషి చేయాలని చెప్పారు. డిగ్రీతోపాటు బీఈడీ, ఇంటర్‌తోపాటు డీఈడీ అర్హత ఉన్న వారు ఈనెల 8వ తేదీ లోపుగా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వారి నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తున్నట్టు తెలిపారు.

దీపావళికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దీపావళి పండగ సందర్భంగా ఎటువంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా సురక్షితమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఇందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన దీపావళి పండగ ఏర్పాట్లపై అధికారులు, మున్సిపాలిటీ కమిషనర్లు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దీపావళికి ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌ను రూపొందించి, ప్రదర్శించాలని జేసీ అధికారులకు సూచించారు. అనుమతి లేకుండా ఎవరూ బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలు నిర్వహించకుండా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలు తనిఖీలు నిర్వహించాలన్నారు. పండుగ ముందు మూడు రోజుల పాటు మాత్రమే బాణసంచా విక్రయాలు, నిర్దిష్ట వేళల్లో అనుమతించాలని, ఇందుకు సురక్షితమైన, బహిరంగ ప్రదేశాలను ఈ నెల 15వతేదీ లోపున గుర్తించి, తాత్కాలిక అనుమతులు జారీ చేయాలని సూచించారు. ఒక్కో లేఅవుట్‌లో 50 షాపులకు మించి ఉండకూడదన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీ, ఫైర్ ఆఫీసర్, మండల స్థాయిలో తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఫైర్ సిబ్బంది అనువైన, సురక్షితమైన మైదానాలను పరిశీలించి, విక్రయ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించాలన్నారు. ఒక్కో షాపు కనీసం 3 మీటర్ల దూరంలో ఉండేలా చూడాలని, అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు సులువుగా సంచరించేందుకు వీలుగా 6 మీటర్ల వెడల్పు మార్గం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. బాణసంచా విక్రయదారులు అధిక ధరలతో వినియోగదారులను దోచుకోకుండా వాణిజ్య పన్నులు, లీగల్ మెట్రాలజీ అధికారులు ఎమ్మార్పీ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు.

సకాలంలో సమాచారం అందించాలి

బోట్‌క్లబ్: ప్రయాణికులకు కావాల్సిన సమాచారం సకాలంలో అందించాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. కాకినాడలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం సమాచారం కేంద్రం సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. స్త్రీ శక్తి పథకం అమలులోకి వచ్చిన తర్వాత కాకినాడ బస్ స్టేషన్‌లో విపరీతమైన రద్దీ ఏర్పడడంతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమాచారం కేంద్ర సిబ్బందిపై ఒత్తిడి పెరిగిందన్నారు. ప్రతిరోజు వేల సంఖ్యలో మహిళా ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు వెళ్లేందుకు విచారణ కోసం సమాచారం కేంద్రం వద్దకు వస్తుంటారన్నారు. సిబ్బంది రద్దీ పెరగడంతో విసుగుచెంది సరైన సమాధానం చెప్పకుండా ఉండకూడదన్నారు. సిబ్బంది ప్రయాణికులతో ఎలా వ్యవహరించాలో తెలియజేశారు. డిపో మేనేజర్ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ ధర్మారావు, పీఆర్వో వెంకట్రాజు పాల్గొన్నారు.

బాబ్జీకి సముచిత స్థానం కల్పిస్తాం



కన్నబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న బాబ్జీ

కాకినాడ రూరల్: ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంపీపీ పదవిని త్రుణ ప్రాయంగా వదులుకున్న సీనియర్ నాయకుడు గోపుశెట్టి పద్మజ, బాబ్జీ కుటుంబానికి అధికారంలోకి వచ్చిన తరువాత సముచిత స్థానం కల్పిస్తామని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటరు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. పార్టీ ఎస్ఈసీ సభ్యుడిగా నియమితులైన కొవ్వాడకు చెందిన గోపుశెట్టి బాబ్జీ శనివారం రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో కన్నబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ బాబ్జీ కుటుంబం మాటకు నిలబడి ఎంపీపీ పదవిని వదులుకుందన్నారు. ఆయనకు ఆ గౌరవం ఎప్పటికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొవ్వాడ ఉప సర్పంచ్ తోటకూర శ్రీనివాస్, వరస జాన్ ప్రభాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కందిల్లి రవి, కొప్పిశెట్టి సత్యనారాయణ, జక్కపు రాంబాబు, సింహద్రి, గోపుశెట్టి సూర్యనారాయణ, సిద్ధా సత్యనారాయణ, అమ్మలమ్మ, సత్యవతి, రాజు, కోమలి సత్యనారాయణ, సూరాడ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ధర్నా



సభలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

కాకినాడ రూరల్: ఇందిరమ్మ గృహ సముదాయం లబ్ధిదారులకు అందాల్సిన యాజమాన్య పట్టాలు తక్షణం పంపిణీ చేయాలని కోరుతూ చీడిగ గ్రామంలో లబ్ధిదారులు శనివారం ధర్నా నిర్వహించారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక గ్రామ సభ జరుగుతుండగా లబ్ధిదారులు 72మంది అక్కడకు చేరుకుని న్యాయం చేయాలని నిరసన వ్యక్తం తెలిపారు. వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు బాధితులు సమస్యను ఆలకించి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధితులు తరపున వచ్చిన సీపీఎం నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు ఇచ్చిన అనేక సంవత్సరాలు గడచినా పట్టాలు ప్రభుత్వ శాఖ వద్దే ఉంచుకోవడం అన్యాయమన్నారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలోనే లబ్ధిదారులు ఎటువంటి చెల్లింపులు చేయనవరం లేదని చెప్పారని, అనేక సంవత్సరాలు గడచిపోయాయని ఇప్పటికైన కూటమి ప్రభుత్వం స్పందించిన న్యాయం చేయాలని కోరారు.

శ్రీపీఠంలో ఐశ్వర్య కంకణాల పంపిణీ



శ్రీపీఠంలో కంకణాలు పంపిణీ చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో మహాశక్తి యాగం ముగియడంతో కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలకు ఐశ్వర్య కంకణాలు(రాగి కంకణాలు) శనివారం పరిపూర్ణానంద స్వామి స్వయంగా పంపిణీ చేశారు. కుంకుమార్చనలకు రిజిస్ట్రేషన్లు చేయించుకుని, మహాశక్తి యాగంలో పాల్గొని హోలోగ్రామ్ వేయించుకున్న వారు భారీగా తరలి వచ్చి ఈ కంకణాలను స్వీకరించారు. ఆదివారం కూడా కంకణాల పంపిణీ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

ఘనంగా ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



మాజీ మంత్రి వేణు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఏపీ రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అతిథులుగా విచ్చేశారు. సంఘం తరుపున వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఎముకలకు సంబంధించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కైరా ఎమర్జన్సీ అండ్ ట్రామా సెంటర్‌కు చెందిన వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎముకలకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, మహిళలకు సంబంధించిన పరీక్షలు, సుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేయనున్నట్టు తెలిపారు.

కల నెరవేరేనా..!

- పెద్దాపురంలో మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయం
- స్థలం కేటాయించిన మున్సిపాలిటీ
- భవనం నిర్మించిన దాతలు
- అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన పనులు



పెద్దాపురం మున్సిపల్ పార్కు వద్ద మ్యూజియం కోసం నిర్మించి భవనం

సామర్లకోట: విజ్ఞానం, వినోదం అందించే మ్యూజియం ఏర్పాటు పెద్దాపురం ప్రజల కలగా మారింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోనే మున్సిపల్ పార్కులో మ్యూజియంను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపాలిటీ స్థలం కేటాయించడంతో బచ్చుఫౌండేషన్ అధినేతలు ముందుకు వచ్చి సుమారు రూ.కోటితో 2009లో భవనం నిర్మాణం చేశారు. ఈ భవనాన్ని అప్పటి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు ప్రారంభించారు. ఈ మ్యూజియంలో జిల్లాతోపాటు దేశ వ్యాప్తంగా కనుగొన్న చారిత్రాత్మక పరికరాలు మ్యూజియంలో ఉంచాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు మ్యూజియంపై శ్రద్ధ చూపిన దాఖలాలు కనిపించడంలేదు. మ్యూజియం ప్రారంభించి పర్యాటక పురావస్తు శాఖ అధికారులకు అప్పగించగా వారి నిర్లక్ష్యం కారణంగా అందుబాటులోకి రాకుండాపోయిందని ఆరోపణలు ఉన్నాయి.

కలగా మిగిలిన ఆనందం

మ్యూజియంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, రాజులకు చెందిన విషయాలు, రాజకీయ అంశాలు, పురావస్తు శాఖకు సంబంధించిన అనేక చిత్రపటాలు, విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటు ఆయా రాష్ట్రాలో ఉన్న ప్రసిద్ధి రూట్ మ్యాప్‌ను కూడా రూపొందించి ప్రజలు సులభంగా ఆయా క్షేత్రలను దర్శించుకునేలా ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే పెద్దాపురం మున్సిపాలిటీ, పురావస్తు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా మూజియం ప్రజలకు అందుబాటులోకి రాలేదని వాదనలు ఉన్నాయి. ఈ మ్యూజియంలో ప్రతి జాతీయ నాయకునికి సంబంధించిన జీవిత చరిత్ర, పురాతన కట్టడాలు, వాటి నిర్మాణానికి సంబంధించిన అంశాలతో చరిత్రతో కూడిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మ్యూజియం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు విజ్ఞానంతో పాటు వినోదం కలుగుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే వారి ఆనందం కలగానే మిగిలిపోయింది.

బాధ్యత మున్సిపాలిటీదే..

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉన్న హిస్టారికల్ మ్యూజియంను తెరిపించాల్సిన బాధ్యత కూడా మున్సిపాలిటీపైనే ఉందనే వాదనలు ఉన్నాయి. మ్యూజియం భవనం నిర్మాణం చేసిన స్థలంలో మున్సిపల్ పార్కు ఉండడంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అనేక మంది పార్కులో కాలక్షేపం చేస్తున్నారు. ఈ మున్సిపల్ పార్కు సమీపంలోనే పెద్దాపురం గ్రంథాలయం ఉండడంలో గ్రంథాలయానికి వచ్చిన వృద్ధులు, ఆ పార్కులో విశ్రాంతి తీసుకొంటున్నారు. మ్యూజియం వినియోగంలోనికి తీసుకుకొని వస్తే బావితరాల వారికి విజ్ఞానం పెరుగడంతోపాటు దాత ఆశయం నెరవేరుతుంది.



భవనం ప్రారంభోత్సవ శిలాఫలకం

అధికారుల నిర్లక్ష్యం



మున్సిపాలిటీ ముందుకు వచ్చి లక్షల రూపాయల విలువ చేసే స్థలం మ్యూజియంకు కేటాయించింది. దాత మ్యూజియం భవన నిర్మాణం చేసి 15 ఏళ్లు పూర్తయింది. అయినా అధికారులు ఇప్పటి వరకు మ్యూజియంకు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. ముఖ్యకూడలి ప్రదేశంలో మ్యూజియం ఉంటే బాగుంటుంది. అధికారులు దానిపై దృష్టి సారించాలి.

– వాసంశెట్టి గంగ, మాజీ కౌన్సిలర్, పెద్దాపురం

పురావస్తు శాఖకు లేఖ రాస్తాం



దాత సహకారంతో నిర్మించిన మ్యూజియం భవనాన్ని పురావస్తు శాఖకు స్వాధీనం చేశారు. అయితే ఆ శాఖాధికారులు ఇప్పటి వరకు దానిపై ఎటువంటి శ్రద్ధ చూపలేదు. భవనాన్ని ఉపయోగించకపోవడం వలన పాడైపోయే అవకాశం ఉంది. మ్యూజియం ప్రజలకు ఉపయోగపడేలా వినియోగంలోనికి తీసకు రావాలని పురావస్తు శాఖ అధికారులకు మున్సిపాలిటీ తరుపున లేఖ రాస్తాం.

– నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్, పెద్దాపురం